పల్లె వెలుగు వచ్చేదెప్పుడు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది, కోనరావుపేట మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం కూడలి. ఇక్కడి నుంచి బస్టాండ్ వరకు సుమారు కిలోమీటర్ దూరం ఉంటుంది. మండల కేంద్రానికి వచ్చే బస్సులు అన్నీ అంబేడ్కర్ కూడలి వరకు వచ్చి వెళ్తుంటాయి. గ్రామంలో సుమారు 75 శాతం జనాభా ఇక్కడే ఉంటుంది. ఇక్కడికి బస్సు రాక వృద్ధులు, వికలాంగులు, ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ఇది ఒక్క మండలకేంద్రంలోని ప్రజల సమస్యే కాదు. మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న పరిస్థితి.

- గ్రామాల్లోకి రాని ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులు
- ఇబ్బంది పడుతున్న వృద్ధులు, మహిళలు
- ఊళ్లోకి రప్పించాలని డిమాండ్



ఆలయం వద్ద ఇరుకుగా మారిన రహదారి

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోకి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులు గ్రామంలోకి రావాలని ఏళ్లుగా కోరుతున్నా ఇప్పటి వరకు రావడంలేదని, తమకు ఇబ్బందులు తప్పడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. కోనరావుపేట బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి గ్రామం లోపల ఉన్న గాంధీ విగ్రహం వరకు సుమారు ఒక కిలోమీటరు దూరం ఉంటుంది. అంబేడ్కర్ సమీపంలో గ్రామంలోని 25 శాతం ప్రజలు ఉంటే మిగతా 75 శాతం ప్రజలు గాంధీ విగ్రహం వరకు ఉంటారు. ఇక్కడి నుంచే ఎగ్లాస్‌పూర్ గ్రామానికి వెళ్లేందుకు రహదారి ఉంది.

మహిళల, వృద్ధుల ఇబ్బందులు

కోనరావుపేట బస్టాండ్ వద్దకు ప్రజలు వెళ్లాలంటే సుమారు కిలోమీటర్ దూరం ఉంటుంది. ఇక్కడి ప్రజలు ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే కిలోమీటర్ నడవాల్సిందే. వృద్ధులు, వికలాంగులు, మహిళలు నడవాలంటే అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రులకు వెళ్లేవారి ఇబ్బందులు వర్ణనాతీతం. బస్టాండ్ వరకు వెళ్లాలంటే ఆటోలో లేదా ద్విచక్రవాహనంపై వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలోకి రావాలని కొన్నేళ్లుగా కోరుతున్నా ఇప్పటి వరకు గ్రామంలోకి రాని పరిస్థితి.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు

కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఇరుకుగా మారింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల వెడల్పుగాను, మరికొన్ని ప్రాంతాల్లో ఇరుకుగాను మారడంతో బస్సు రావడం సమస్యగా మారుతోంది. ప్రస్తుతంలో గ్రామం మీదుగా ఎగ్లాస్‌పూర్ గ్రామం వరకు బస్సు వెళ్తోంది. కానీ ఒక బస్సు వెళ్తుండగా, మరో బస్సు ఎదురుగా వస్తే ఎటూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది.

మండలంలో బస్సు రాని గ్రామాలు ఇవి

కోనరావుపేట మండలంలోని పలు గ్రామాలకు ఇప్పటికే బస్సు సౌకర్యం లేదు. మండలంలోని మంగళ్లపల్లి, గొల్లపల్లి(వట్టిమల్ల), రాజన్నగొల్లపల్లి (కొలనూర్), గోవిందరావుపేట (బావుసాయిపేట), శివంగాలపల్లి, కమ్మరిపేటతండా (వట్టిమల్ల) గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నడవాలంటే కష్టమవుతుంది



మా ఇల్లు కోనరావుపేటలోని గాంధీ విగ్రహం సమీపంలో ఉంది. ఏదైనా ఊరుకు వెళ్లాలన్నా, ఆస్పత్రికి వెళ్లాలన్నా ఇక్కడి నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న బస్టాండ్ వరకు నడిచి వెళ్లాల్సి వస్తోంది. అదే బస్సు గాంధీ విగ్రహం వరకు వస్తే మాలాంటి వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– అంబటి రామవ్వ, కోనరావుపేట

గ్రామంలోకి వచ్చేలా చూస్తాం



గ్రామంలోకి బస్సు రావాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. బస్సులు రావడానికి వీలుగా రహదారిని 40 ఫీట్ల వెడల్పునకు తీర్మానించాం. 50 శాతం రహదారి పూర్తయింది. కానీ కొన్నిచోట్ల చాలా ఇరుకుగా ఉంది. ఒక వాహనం వస్తే మరొటి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామంలోని ప్రధాన రహదారిని 40 ఫీట్ల వెడల్పు చేస్తాం.

– రేఖ, సర్పంచ్, కోనరావుపేట

బస్సు వచ్చేలా చూడాలి



గ్రామంలోని ఇళ్ల మొత్తం ఇటే ఉన్నా బస్సు మాత్రం అక్కడి నుంచి అటే వెళ్లడంతో అసౌకర్యంగా ఉంది. ఊళ్లో ఉన్న ప్రజలను పట్టించుకోవడం లేదు. కోనరావుపేటకు వచ్చే ఆర్టీసీ బస్సులు గాంధీ విగ్రహం వరకు వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

– గడ్డమీది లచ్చవ్వ, కోనరావుపేట

సమస్యను పరిశీలిస్తాం

ప్రస్తుతం కోనరావుపేట బస్టాండ్ వరకు ఆర్టీసీ బస్సులు వచ్చి వెళుతున్నాయి. గ్రామం లోపలగల గాంధీ విగ్రహ కూడలి వరకు బస్సు రావాంటే ఒకసారి వచ్చి రూట్‌ను పరిశీలించాలి. రూట్‌ను చెక్ చేసి గాంధీ విగ్రహం వరకు బస్సులు వచ్చేలా ప్రయత్నిస్తాం. ప్రజల సమస్యల పరిష్కారమయ్యేలా చూస్తాం.

– మనోహర్, డిపో మేనేజర్, సిరిసిల్ల

క్లుప్తంగా

నిరుపేదలకు 'గృహలక్ష్మి' వరం



సర్వే చేస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: ఇళ్లులేని వారికి సొంత ఖాళీ ప్రదేశంలో గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3లక్షల ఆర్థికసాయం అందిస్తోందని ఈ అవకాశాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో వజీర్, ఎంపీటీసీ పందిర్ల నాగరాణి అన్నారు. అధికారులతో కలిసి శనివారం ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంతో పాటు రాచర్లతిమ్మాపూర్‌లో గృహలక్ష్మి సర్వేను చేపట్టారు. సర్వేచేస్తున్న అధికారులకు పలు సూచనలుచేశారు. ఇళ్లులేని వారిని గుర్తించి అర్హులకు గృహలక్ష్మి పథకం అందేలా చూడాలని కోరారు. సర్వేకు దరఖాస్తులు చేసుకున్న వారు సర్వేకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏవో చాడ భూంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే బీఎస్పీ లక్ష్యం



ప్రచారం చేస్తున్న బీఎస్పీ నాయకులు

బోయినపల్లి: ప్రజల సమస్యలు తెలుసుకునేందకు గుడ్‌మార్నింగ్ చొప్పదండి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ చొప్పదండి అసెంబ్లీ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని వెంకట్రావుపల్లిలో మండల కమిటీ సభ్యులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ఏహామీ నెరవేర్చక మోసం చేస్తున్నారన్నారు. ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్‌ను సీఎం చేయడమే బీఎస్పీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లెందుల అరుణ్, సావనపెల్లి సురేందర్, సంద్రగిరి సంతోష్, చంద్రశేఖర్, కిషోర్, సాయి, పర్శరామ్ ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ ఇల్లంతకుంట పీఏసీఎస్ ఎదుట సీఎం చిత్రపటానికి పీఏసీఎస్ చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దంవేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి హాజరై మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి కేసీఆర్ సర్కారు పనిచేస్తోందని, ప్రతిపక్షాలు ఉనికి కాపాడుకునేందుకు బురద రాజకీయాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంజీవ్, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, ఉపసర్పంచ్ సాదుల్, సీఈవో రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

పేరెంట్స్ సమావేశం



మాట్లాడుతున్న హెచ్ఎం రవీందర్

ముస్తాబాద్: మండలంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో పేరెంట్స్, టీచింగ్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తే.. మంచి ఫలితాలు పొందవచ్చని హెచ్ఎం రవీందర్ అన్నారు. ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించేలా ఆదేశాలు జారీచేసిందన్నారు. చదువుల్లో విద్యార్థుల వెనుకబాటు, క్రమశిక్షణ, ఇంటివద్ద ఎలా ఉంటున్నారో తెలుసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లల చదువు విషయంలో సందేహాలు నివృత్తి చేసుకున్నారు. సర్పంచ్ గాండ్ల సుమతి, ఎస్ఎంసీ చైర్మన్ ఆరుట్ల రాజిరెడ్డి, వైస్‌చైర్మన్ సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోరు ప్రారంభం



తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో శనివారం జెడ్పీటీసీ నిధులు రూ. లక్షతో శనివారం బోరు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జెడ్పీటీసీ పూర్మాని మంజులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాంలింగారెడ్డి, సర్పంచ్ మాట్ల మధు, నాయకులు విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ డే



సన్మానిస్తున్న మై వేములవాడ ట్రస్టు సభ్యులు

సిరిసిల్లటౌన్/వేములవాడ/వేములవాడరూరల్/చందుర్తి/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీడే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చరిత్రలో ఫొటోగ్రాఫర్ల ప్రాధాన్యతను వక్తలు కొనియాడారు. వేములవాడలో మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు స్థానిక ఫొటోగ్రాఫర్లను ఘనంగా సన్మానించారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వపాఠశాల విద్యార్థులు ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటారు. వికాస్ స్వర్ణ పతకం, సుదీక్ష రజతం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం ప్రమీల, పీడీ. హమీద్, రవీందర్, సలాం, కోటేశ్వర్ అభినందనలు తెలిపారు.

గిరిజన మహిళపై దాడి అమానుషం

ఎల్లారెడ్డిపేట: ఎల్బీనగర్ పోలీసులు గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమని టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి మాలోతు సూర్యనాయక్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల మీద దాడు లు రోజురోజుకు పెరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన పోలీసులను సస్పెండ్ చే యాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా చూడాలని, లేని పక్షంలో గిరిజనుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ధర్నాను జయప్రదం చేయాలి

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ ప్రతిసారి ఎన్నికల కు ముందు హామీలు ఇస్తూ ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదంటూ దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో సోమవా రం ఇల్లంతకుంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలంగాణ దళిత సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సావనపెల్లి రాకేశ్ తెలిపారు.

గాంధీ చిత్రం వీక్షించిన విద్యార్థులు





గాంధీ చిత్రం వీక్షించేందుకు థియేటర్‌లకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

సిరిసిల్లకల్చరల్/వీర్నపల్లి: స్వాతంత్ర వజ్రోత్సవ సంబరాల్లో భాగంగా ప్రభుత్వం ఉచితంగా ప్రదర్శిస్తున్న గాంధీ చలన చిత్రానికి విద్యార్థులనుంచి స్పందన లభిస్తోంది. ఈనెల 14నుంచి ప్రదర్శిస్తున్న చిత్రాన్ని శనివారం వరకు 8,967 మంది వీక్షించినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం మినహాయించి ఈనెల 24 వరకు గాంధీ చిత్రాన్ని ప్రదర్శిస్తామని విద్యార్థులు, తల్లిదండ్రులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని డీఈవో రమేశ్, డీపీఆర్వో మామిండ్ల దశరథం కోరారు. వీర్నపల్లి మండలంకేంద్రంలోని జెడ్పీపాఠశాల, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు శనివారం రాజన్న సిరిసిల్లా జిల్లాలోని ఓసినిమా థియేటర్‌లో గాంధీచలనచిత్రాన్ని 210 మంది వీక్షించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

సిరిసిల్లటౌన్: సీఎం సహాయ నిధినుంచి మంజూరైన చెక్కును మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ లబ్ధిదారులకు అందించారు. శనివారం తన సొంత వార్డులోని దండు శివప్రసాద్ అనారోగ్యంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయాన్ని కోరుతూ..ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. ఈమేరకు మంత్రి కేటీఆర్ చొరవతో చెక్కును ప్రభుత్వం విడుదల చేయడంతో చైర్‌పర్సన్ జిందం కళ దండు శివప్రసాద్ తండ్రి బాబుకు చెక్కు అందించారు.

గురుకులంలో రేపు స్పాట్ అడ్మిషన్లు

వేములవాడరూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కరీంనగర్, వరంగల్ రీజియన్ పరిధిలో కొనసాగుతున్న గురుకుల జూనియర్ కళాశాల వేములవాడ పట్టణంలోని మానాల గురుకుల పాఠశాలలో ఈ నెల 21న ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిన సీట్లకు సోమవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వేములవాడ ప్రిన్సిపాల్ తెలిపారు. ఉదయం 10 గంటలకు పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివరాలకు సెల్ 6300794868 9573202776, 9912789770 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: పట్టమంలోని మల్లారం రోడ్డులో పనులు చేపడుతున్న సందర్భంగా ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు సెస్ ఏఈ సిద్ధార్థ శనివారం తెలిపారు. మల్లారం రోడ్డు, పాపన్నచౌక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని సెస్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని చంద్రంపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వెంకంపేట, పాతబస్టాండ్, సంజీవయ్యనగర్, సర్దార్‌నగర్, శాంతినగర్, అంబేద్కర్‌నగర్, రాళ్లబావి, విద్యానగర్, రెడ్డివాడ, గాంధీనగర్, గీతానగర్, పోచమ్మటెంపుల్, సుభాష్‌నగర్, చంద్రంపేట, రగుడు, తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలన్నారు.

గద్దర్ స్మారక సభను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

వేములవాడరూరల్: ప్రజాయుద్ధనౌక గద్దర్ స్మారక సభను ఈనెల 21 సోమవారం సిరిసిల్లలో నిర్వహిస్తున్నట్లు జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొజ్జకనకయ్య తెలిపారు. ఈ సందర్భంగా సినారె కళామందిర్ ఆవరణంలో కరపత్రాలు ఆవిష్కరించారు. సిరిసిల్ల వాసవీ కల్యాణ మండపంలో ఉదయం 10.30కి నిర్వహించే స్మారక సభకు కళాకారులు పెద్దఎత్తున తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటివేణు, ఎల్ల పోశెట్టి, బొడ్డు రాములు, ఆవునూరి ప్రభాకర్, సోమినేని బాలు, గంగ శ్రీకాంత్, గుమ్మడి రాజేశం, రాములు ఉన్నారు.

భళా..విద్యార్థుల చిత్రకళా



చిత్రాలను పరిశీలిస్తున్న డీఈవో రమేశ్

సిరిసిల్లకల్చరల్: పసి వయసులోనే సృజనాత్మకతను గుర్తించి వెలికితీస్తే విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారని డీఈవో రమేశ్ అన్నారు. శనివారం గీతానగర్ జెడ్పీపాఠశాలలో ఏర్పాటుచేసిన విద్యార్థుల 'చిత్రకళ' ప్రదర్శనను ప్రారంభించారు. వివిధ అంశాలపై చిన్నారులు గీసిన చిత్రాలను పరిశీలించి ప్రశంసించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాల ఆధారంగా వారి ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. డ్రాయింగ్ మాస్టర్ రుద్ర రమేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో దూస రఘుపతి, హెచ్ఎం నాగుల భాగ్యరేఖ, టీచర్లు అర్చన, మాధురి, విమోచన, విజయలక్ష్మి, అంబటి రమేశ్, వెంకటరాములు ఎలగొండ రవి, సీఆర్పీ రవికిరణ్ పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన పథకం అమలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ప్రశాంత్

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుచేయాలని, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు అన్నిరూట్లలో బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. వేములవాడలో అద్దె భవనాల్లోని పాఠశాలలు, హస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈవో పోస్టులను భర్తీచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మంద అనిల్, రాకేశ్, ఆదిత్య, వేణు, అభిషేక్, రామ్‌చరణ్, సాయిచరణ్ ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో అవకాశం ఇవ్వాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో అన్నిమేనేజ్‌మెంట్ టీచర్లకు అవకాశం కల్పించాలని టీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి దోర్నాల భూపాల్‌రెడ్డి, రాంనాథ్‌రెడ్డి కోరారు. డీఈవో కార్యాలయంలో డీఈఓ రమేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సెప్టెంబర్ 5న విద్యాశాఖ తరపున జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు మోడల్‌స్కూల్, కస్తూరిబా, అర్బన్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. గతంలో పదేళ్ల పూర్తికాని మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ కేటగిరీలో అవకాశం ఇవ్వలేదని, ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధ్యాయులు పదేళ్లకాలం పూర్తైనవారిని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కస్తూరిబా, పట్టణ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు సైతం అవకాశం కల్పించాలని కోరారు.

కలుపు మొక్కల నివారణపై అవగాహన



పటాలతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



రుద్రంగిలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కోనరావుపేట: జగిత్యాలలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల గ్రామీణ విశ్లేషణాత్మక తులనం కార్యక్రమంలో భాగంగా డీఏటీటీసీ సెంటర్ కరీంనగర్ ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని రైతువేదికలో శనివారం సమావేశమై గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతులకు వారు పండించే పంటలు, గ్రామీణవనరులు, గ్రామాల్లోని సమస్యలు కాలానుగుణంగా గ్రామాభివృద్ధిని, వ్యవసాయ కాలచక్రంను వివిధరకాల పటాల ద్వారా వివరించారు. రైతుల ద్వారా గ్రామంలోని వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, ఉపసర్పంచ్ చేకుటి మల్లేశం, ఏఎంసీ, పీఏసీఎస్ డైరెక్టర్ మంద రాజిరెడ్డి, వార్డుమెంబర్లు, కళాశాల అధ్యాపకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయంలో..

రుద్రంగి: జిల్లెల్లలోని బాబూ జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం రుద్రంగి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వయ్యారిభామ (పార్థీనియం), కలుపుమొక్కల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా వయ్యారిభామ, కలుపుమొక్కలతో పంటలకు కలిగే నష్టాన్ని వివరించారు. ఇందుకు నివారణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, నాయకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఆర్ ఇచ్చిన మాట నిలుపుకోవాలి



మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్లటౌన్: కార్మికవాడల్లోని పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పిస్తామన్న మాటను మంత్రి కేటీఆర్ నిలుపుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి కోరారు. శనివారం కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. సిరిసిలలోని కార్మికవాడలైన బీవైనగర్, సుందరయ్యనగర్, ఇందిరానగర్, గణేష్‌నగర్, తారకరామానగర్ ప్రాంతాల్లో సుమారు 5వేల మందికి ప్రభుత్వం నివేశన స్థలాలిచ్చిందన్నారు. వీటికి రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించేలా జీవో తీసుకొస్తామని కేటీఆర్ పక్షం రోజుల క్రితం మాట ఇచ్చారన్నారు. ఆర్థిక స్థోమత లేకుండా ఇప్పటి వరకు కూడా ఇల్లు కట్టుకోని పేదలకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని కోరారు. సామల మల్లేశం, మంచికట్ల రమేశ్, అజ్జ వేణు, వద్దేపల్లి లక్ష్మణ్, సోమ నాగరాజు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



గంభీరావుపేట: మండలంలోని భీముని మల్లారెడ్డి పేట గ్రామంలో కొంపల్లి రాజమల్లు అనే వ్యక్తి ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శనివారం పరామర్శించారు. కుటుంబసభ్యులను ఓదార్చి భరోసా కల్పించారు. నాయకులు శెట్టి రవి, సుభాశ్, రాజేందర్, హన్మండ్లు ఉన్నారు.

కొండెంగ దాడి బాధితురాలికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట: కొండెంగ దాడిలో గాయపడ్డ మండలంలోని నారాయణపూర్‌కు చెందిన బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు లద్దునూరి తిరుపతి తల్లి నర్సవ్వను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శనివారం సాయంత్రం పరామర్శించారు. ఇంటి వద్ద కూర్చున్న నర్సవ్వపై కొండెంగ దాడి చేయడంతో కాలు విరిగింది. మండల కేంద్రంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, నాయకులు హసన్, తులసీ, లచ్చన్న, పర్శరామురెడ్డి ఉన్నారు.